విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 01, జూలై 2024

అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి : మంత్రి బీసీ

విశాలాంధ్ర - బనగానపల్లె : ప్రభుత్వ అధికారులు బాధ్యతాయుతంగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రివర్యులు బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం బనగానపల్లె మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ భవనంలో మండల సర్వేసభ్య సమావేశం ఎంపీడీవో నాగరాజు, ఎంపీపీ మానస వీణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో పలు శాఖల అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర్ రెడ్డి, మిట్టపల్లి సర్పంచ్ తులసీశ్వరరెడ్డి, ఎర్రగుడి ఉప సర్పంచ్ భాస్కర్ రెడ్డి, తిమ్మాపురం సర్పంచ్ ఆల్లె సుప్రజ, పసుపల, చిన్న రాజుపాలెం తండా, తమ్మడపల్లె, రామతీర్థం, చెరువు పల్లె, చెర్లో కొత్తూరు గ్రామాలకు చెందిన పలువురు సభ్యులు ఆయా గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యాశాఖ తరఫున ఎంఈఓ స్వరూప తమ నివేదికను సభ దృష్టికి తీసుకురాగా నెలలో ఎన్ని సార్లు పాఠశాలలు తనిఖీలు చేశారో తనకు రికార్డు పంపాలని మంత్రి ఆదేశించారు. అలాగే అంగన్వాడి భవనాలపై తనకు పూర్తి నివేదికను తయారుచేసి పంపాలని సిడిపివోను ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని అన్నారు. జగనన్న కాలనీలు అనువైన చోట ఇచ్చి ఉంటే లబ్ధిదారులు ముందుకు వచ్చేవారని, అనువు గాని చోట ఎంపిక చేసినందుకే పలుకూరు, యాగంటీపల్లె తదితర గ్రామాలలో లబ్ధిదారులు ఇల్లు కట్టుకు నేందుకు ముందుకు రాలేదని అన్నారు. నాడు నేడు పథకంలో కోట్ల రూపాయలు మంజూరైనా సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను గత ప్రభుత్వ పూర్తిగా నిర్వీర్యం చేసిందని, సర్పంచులకు ఎలాంటి అధికారాలు, నిధులు లేకుండా నామమాత్రంగా మిగిలారని అన్నారు. రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారని అన్నారు. ప్రజా ప్రతినిధులు వస్తుంటారు పోతుంటారని, అధికారులు శాశ్వతమని, వారు ఎవరి ఒత్తిళ్ళకు తలొగ్గకుండా ప్రజలకు జవాబుదారీగా పని చేయాలని అన్నారు. కొందరు సభ్యులు తమ గ్రామాల్లో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని సభ దృష్టికి తీసుకువచ్చారు. రాత పూర్వకంగా అవినీతిపై ఫిర్యాదు చేస్తే విజిలెన్స్ అధికారులతో విచారణ చేవడతామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మానస వీణ, జడ్పిటిసి లక్ష్మీ సుబ్బమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, పంచాయతీరాజ్ డిఈఈ నాగ శ్రీనివాసులు, హౌసింగ్ డిఇ కృష్ణారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ డీఈ ఉమాకాంత్ రెడ్డి, తహసీల్దార్ రవీంద్రారెడ్డిలతో పాటు అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచ్‌లు బండి మౌలిశ్వర్ రెడ్డి, బొబ్బల గోపాల్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో బదిలీలకు చీకట్లు

- ఏళ్లు దాటిన బదిలీలు కాని వైనం
- వైసీపీ కాలంలో వెల్లివిరిసిన బంధు ప్రీతి
- బయట పడని రూ.10 లక్షల గోల్‌మాల్ కహాని

విశాలాంధ్ర - డోన్ రూరల్: వెలుగు కార్యాలయంలో కమ్యూనిటి కోఆర్డినేటర్లు బదిలీలు కాకుండా ఎన్నో సంవత్సరాలుగా తిష్ట వేసి ఉండడం పట్ల పలు విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హాయంలో కొంతమంది రాజకీయ నాయకుల బంధు ప్రీతి మితి మీరి పోవడం వలన పలువురు అధికారులు వెలుగు కార్యాలయంలో తిష్ట వేసినట్లు వినికిడి. కొందరిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసిన చుట్టపు చూపుగా వెళ్లి 2,3 నెలల లోనే తమ రాజకీయ ప్రాబల్యంతో తిరిగి ఇక్కడికి వచ్చి తాము చెప్పిందే వేదం చేసిందే చట్టం అంటూ పెత్తనం చెలాయించడం పరిపాటిగా మారిందని కార్యాలయంలో పలువురు గుసగుసలాడుతున్నారు.

రూ.10 లక్షల అవినీతి ఆరోపణలు: రాజకీయ పలుకుబడి ఉన్న వారికే అందలం లేకుంటే దూరం దూరం అన్నట్టుగా కొందరు అధికారుల ప్రవర్తన ఉందని ఇక్కడ పనిచేసిన ఉద్యోగుల వాదన. గతంలో దాదాపు రూ.10 పది లక్షల గోల్ మాల్ జరిగిన లోపాయకారి ఒప్పందంతో ఆ లెక్కలు ఇప్పటివరకు రాజకీయ పలుకుబడి వల్ల బయటికి రాకపోవడం గమనార్హం. గత కొన్ని సంవత్సరాలుగా తిష్ట వేసిన అధికారులను,గతంలో జరిగిన అవినీతి ఆరోపణలపై నూతనంగా ఏర్పడిన నేటి ప్రభుత్వం లోనైనా పక్కదారి పట్టిన రూ.10 లక్షల సొమ్ము స్వాహాపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం

విశాలాంధ్ర - నంద్యాల: సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమానికి ఈ నెల 01వ తేదీ ఉదయం 9:30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - నంది కొట్కూరు: ప్రజల ఆమోదంతో పూర్తి స్థాయి మెజార్టీతో గెలుపొందిన అధికార పార్టీ కక్ష సాధింపు చర్యలు మానుకొని ప్రజా ప్రభుత్వం అభివృద్దే ధ్యేయంగా పనిచేసి ప్రజల మన్ననలను పొందాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి అన్నారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వేతన జీవులు, చిరుద్యోగులు, కార్మికుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించడం మానుకొని, అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. గ్రామాల్లో పాఠశాలలో పనిచేస్తున్న వంట ఏజెన్సీ మహిళలు, చిరుద్యోగులనూ తొలగించి వారి స్థానంలో తమ రాజకీయ పలుకుబడి, ఆధిపత్యం అవలంబిస్తూ తమ వారిని నియమించు కొనేందుకు చర్యలు తీసుకోవాలని కుయుక్తులు పడుతుండడం సరికాదన్నారు. పనిచేస్తున్న వారిని తొలగించి కొత్తవారిని నియమించు కోవాలనుకోవడం సరికాదని, ఆ ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. ప్రజా రంజక పాలనను అందించాలని విజ్ఞప్తి చేశారు. గెలిచిన ధీమాలో గ్రామాల్లో ఆధిపత్య ధోరణి విడనాడి సంక్షేమం అభివృద్ధి కొరకు పాటుపడాలని కోరారు.

ఎమ్మెల్యేని కలిసిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియను ఆళ్లగడ్డ తాలూకా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం వారు ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకులు, కేంద్ర కాటన్ బోర్డు మాజీ డైరెక్టర్ సిపి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన అఖిలప్రియను కలిసి బొకే ఇచ్చిశుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ తాలూకా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సంఘం కరస్పాండెంట్ పావిరెడ్డి, అమీర్ బాష, ఓబన్న, మహబూబ్ బాష, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

విశాలాంధ్ర - బనగానపల్లె: ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరమని బనగానపల్లె టౌన్ సిఐ ఘంటా సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక కరెంట్ ఆఫీస్ సమీపంలోని నూతనంగా జెన్స్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ కరాటి శిక్షణ కేంద్రాన్ని బనగానపల్లె సిఐ సుబ్బారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బనగానపల్లె టౌన్ సిఐ గంటా సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కె ప్రతాప్ కుమార్, కళ్యాణ్ బాబు సూర్యవంశీలు హాజరై మాట్లాడారు. సీఐ సుబ్బారావు మాట్లాడుతూ తమ పిల్లల చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని పట్టుదల క్రమ శిక్షణతోనే అన్ని రంగాలలో అభివృద్ధి చెందడం సాధ్యమవుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దగ్గర ఉన్న ఐఏఎస్ అధికారి కృష్ణమోహన్ గురించి వివరించారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల నంది పైప్స్ బాడ్మింటన్ అకాడమీ నందు గత రెండు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల బహుమతి ప్రదానోత్సవం ముఖ్య అతిదులుగా స్వామి నేత్రాలయం అధినేత డాక్టర్ లక్ష్మయ్య, డాక్టర్ జనార్ధనరెడ్డి, ఎస్పీవై రెడ్డి మనమల్లు రామరాజ్, సూరజ్ ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి ప్రదానోత్సవం గావించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ సభ్యులు శేషిరెడ్డి, సంజీవరెడ్డీ, కోచ్ నాగార్జున, క్రీడబిమానులు పాల్గొన్నారు.

పేదల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ స్థలాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి : సీపీఐ

విశాలాంధ్ర-డోన్ : మండలంలోని యాపదిన్నె గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాల ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భూపోరాటాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ పట్టణ కార్యదర్శి బి.నారాయణ అధ్యక్ష వహించారు. ముఖ్య అతిథులుగా హాజరై, భూ పోరాటల జెండాను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ కె.రామాంజనేయులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కటారుకొండ సర్పంచ్ నక్కి లెనిన్ బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ కామ్రేడ్ పి.సుంకయ్యలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ డోన్ మండలం యాపదిన్నె గ్రామ శివారులో భూమి సర్వే నెంబర్ 898లో ఒక్క ఎకరా 50 సెంట్లు దాదాపుగా ఐదు సంవత్సరాల నుంచి నిరుపేదల కుటుంబాలు ఆధీనంలో ఉన్నాయన్నారు. అనేక దశలుగా ఉద్య మాలు చేసినప్పటికీ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదన్నారు. డోన్ నియోజకవర్గంలో గతంలో ఆర్థిక శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అనేకసార్లు ఆయన దృష్టి తీసుకుపోయిన పట్టించుకోలేదన్నారు. అనేక సార్లు ఆయన దృష్టికి తీసుకెళ్లిన బుగ్గన మాయ, మాటలు చెప్పి కాలయాపన చేశారని మండిపడ్డారు. డోన్ పట్టణంలోని దొరపల్లె దగ్గర జగనన్న కాలనీలో కొంత ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ బోగాస్ పాస్ బుక్కులు తయారుచేసి వారికి అనుకూలంగా ఉన్న బినామీ పేర్లు సృష్టించి కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానా లూటీచేసిన ఘనులు ఉన్నారన్నారు. ఇక్కడ తహసీల్దార్ పని చేసిన నరేంద్రనాథ్ రెడ్డి మరో తహసీల్దార్ విద్యా సాగర్‌లు డోన్ ప్రాంతంలో విపరీతమైన అవకత వకాలు జరిగాయన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి హుస్సేన్ పీరా, క్రిష్ణగిరి మండల కార్యదర్శి ఖలీల్ బాష, యాపదిన్నె శాఖ కార్యదర్శి పాపారాయుడు, సహాయ కార్యదర్శి రాజు, ఏఐవైఎఫ్ నాయకులు విజయులు, సీసమంతల శాఖ కార్యదర్శి మనోహర్, రామకృష్ణ, వెంకటరాముడు, ఎద్దుపెంట శాఖ కార్యదర్శి ఎర్రి స్వామి, రజాక్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణ చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో గ్రామ నడి మధ్యన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ముళ్ళకాంపల్లో ఉంచారని, తక్షణమే విగ్రహ ఆవిష్కరణ చేయాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం పారుమంచాల గ్రామంలో ముల్లకంపలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత దేశ ప్రజలకు దిక్సూచి అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ముళ్ళకంపల్లో ఉంచి చూస్తూ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అంబేద్కర్‌ని అవమానించడం అంటే రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని వారన్నారు. సాక్షాత్తు గ్రామ మధ్యలో ప్రజలు తిరిగే సెంటర్‌లో అంబేద్కర్ను ఈ విధంగా ఉంచడం చాలా బాధాకరమన్నారు. స్పందించాల్సిన అధికారులు ఎక్కడని వారు ప్రశ్నించారు. నిర్లక్ష్యం చేస్తూ అంబేద్కర్‌ను అవమానిస్తే చూస్తూ ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్యేక దృష్టి కేంద్రికరించాలని వారు అన్నారు. స్పందించ లేని లేనిపక్షంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా సిపిఐ, దళిత సంఘాల ఆధ్వర్యంలో ప్రారంభం చేస్తామని వారు హెచ్చరించారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణకు రాజకీయాలతో ముడి పెట్టవద్దన్నారు అనేక రోజుల నుండి నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు పాలకులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రారంభం చేసేంతవరకు సిపిఐ ఆందోళన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, నరసింహ, బాష, మధు తదితరులు పాల్గొన్నారు.

30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర - నంద్యాల : 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, అజాం బేగ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయు నంద్యాల జిల్లా కార్యాలయంలో ఎస్టియు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఎస్టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, అజాం బేగ్‌లు మాట్లాడుతూ గత వైఎస్ఆర్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో ఉద్యోగులకు రావాల్సిన కరువుభత్యం అరియర్స్ గాని, సరెండర్ లీవులకు సంబంధించిన సొమ్ము గాని, పిఆర్సి అరియర్స్, ఉద్యోగులు తమ అవసరాలకై పొదుపు చేసుకున్న ఎపిజిఎల్ఐ, జిపిఎఫ్ రుణాలు, పండగ అడ్వాన్సులు, సరెండర్ లీవులు చెల్లించకుండా ఉద్యోగులను ఆర్థికంగా ఇబ్బందుల పాలు చేసి ఆ సొమ్ములను దారి మళ్లించడంతో ఉద్యోగులు సహనంతో ఓర్చుకొని సరైన సమయంలో గుణపాఠం చెప్పారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఎంతో ఆశలు పెట్టుకున్నారని, కనుక ఈ ప్రభుత్వం ఉద్యోగుల ఆశయాలకు అనుగుణంగా ఆలస్యం చేయకుండా 30శాతం మధ్యంతర భృతి ప్రకటించి ఉద్యోగులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఎస్టియు రాష్ట్ర మాజీ సహాధ్యక్షుడు ఎస్ చంద్రశేఖర్, నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఛిద్రమైన రహదారితో ప్రజల ఇక్కట్లు

- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయునిపేట, ఎస్ చెన్నంపల్లి గ్రామాల మధ్య రహదారి దెబ్బతిన్నంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రెండు గ్రామాల సుమారు 5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డుకు ఇరువైపులా ఛిద్రం కావడంతో పాటు గుంతల మయంగా మారింది. వాహనాల రద్దీ విపరీతంగా ఉండడంతో అధికారులు గుంతలకు ప్యాచ్‌లు వేసిన ఫలితం లేకుండా పోతున్నది. కోవెలకుంట్ల తాడపత్రి ప్రధాన రహదారి కావడంతో ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర ప్రైవేటు వాహనాలు రోడ్డుపైన రాకపోకలు సాగిస్తుంటాయి. తాడపత్రి నుండి జమ్మలమడుగు, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, నంద్యాల తదితర పట్టణాలకు వెళ్లేందుకు ఈ గ్రామాల మీదుగా వెళితే కిలోమీటర్లు తగ్గుతుండడంతో పలువురు ఈ రహదారి పైనే రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక ఇటీవల తిమ్మనాయునిపేట చెరువు సమీపంలో నేషనల్ పవర్ గ్రేట్ స్టేషన్ నిర్మాణా పనులు జరుగుతుండడంతో రహదారి రద్దీగా మారింది. చాలా ఏళ్ల నుండి పనులు చేపట్టకపోవడంతోనే గ్రామాల మధ్య తారురోడ్డు శిధిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నూతన రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

హామీ ఇచ్చిన ప్రకారం సామాజిక పింఛన్లు పెంచి ఇస్తున్నాం : మంత్రి

విశాలాంధ్ర - నంద్యాల : హామీ ఇచ్చిన ప్రకారం సామాజిక పింఛన్లు పెంచి ఇస్తున్నామని రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాగళం మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు దివ్యాంగులకు పింఛన్‌లు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతూ నేటి నుంచి ప్రారంభం చేస్తున్న సందర్భంగా నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంఘం కార్యాలయం వద్ద సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన, సమన్వయకర్త ఎంపీవి రమణయ్య, అధ్యక్షులు సుబ్బారెడ్డి నిర్వహణలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దివ్యాంగులకు బ్యాక్ లాగ్ ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, పురపాలక సంస్థలు, పంచాయతీలు చట్టరీత్యా కేటాయించాల్సిన 5 శాతం నిధులు దివ్యాంగుల అభివృద్ధికి కేటాయించి, వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామ చంద్రరావు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్‌లకు ఆద్యుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులు, సకలాంగులని వివాహం చేసుకున్నప్పుడు గత ప్రభుత్వం విధించిన పదవ తరగతి పాస్ కావాలన్న నిబంధన సడలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న 20 మంది దివ్యాంగులకు, దివ్యాంగుల సంఘం తరపున ప్రతినెల అందజేసే మందులను మంత్రి ఫరూక్ పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు దివ్యాంగులు పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి ఫరూక్‌ను దివ్యాంగులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. టీడీపీ 12వ వార్డు కౌన్సిలర్ కందే శ్యామ సుందర్ లాల్, గాలి చంద్రశేఖర్, దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మౌలాలి సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - డోన్ రూరల్: ఉపాధ్యాయునిగా ఎనలేని సేవలు అందించిన పెద్ద మౌలాలి పదవీ విరమణ అనంతరం పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యునిగా ఉండి పలువురికి నిరంతర సేవలు అందించడం హర్షణీయమని శతావధాని దత్తాత్రేయ శర్మ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భాను సింగ్ అన్నారు. పెన్షనర్స్ భవన్‌లో కీర్తిశేషులు మౌలాలి చిత్రపటానికి పూలమాల సమర్పించి, నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పెన్షనర్స్‌కు ఎలాంటి సహాయం కావలసిన దగ్గరుండి పని చేసేవాడని, సహాయం కోసం వచ్చిన పలువురికి దగ్గరుండి పనులు చేయడం ద్వారా అటు విద్యార్థుల ఇటు పెన్షనర్ల ఆత్మీయ అభిమానాలు పొందినాడని కొనియాడారు. హనీఫ్, గాలయ్య, గోపాల్, రిటైర్డ్ హెడ్మాస్టర్ బి.కె.నరసింహులు తదితరులు నివాళులర్పించారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్ట్ కింద పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.సుశీలమ్మ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ నంద్యాల జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ డి.శివ బాలకృష్ణ, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు హాజరయ్యారు. సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ హాస్పిటల్స్‌లో పని చేస్తున్న శానిటేషన్, వర్కర్స్‌కి జీతాలు పెంచాలని, కాంట్రాక్టర్లు ప్రతి నెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, పీఎఫ్ డబ్బులు బకాయిలతో పాటు చెల్లించాలని, ఈఎస్ఐ ఫ్యామిలీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, హాస్పిటల్స్‌లో వర్కర్స్ సంఖ్య పెంచాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షులు తులసమ్మ, శివ, పుల్లయ్య, రవి కుమార్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ అధికారుల నియామకం

విశాలాంధ్ర - రుద్ర వరం : మండలం లోని ఆయా సచివాల యాల పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీకి పర్యవేక్షణ అధికా రులను నియమించి నట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జూలై 1వ తేదీన ఆయా సచివాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీపై ఈఓపిఆర్డి.శ్రీనివాస శర్మ, పిఆర్ఏఈ వెంకటరాముడు, ఉపాధిఏపీవో ప్రతాప్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ కుమార్‌లను పర్యవేక్షణ అధికారులుగా ఉన్నతాధికారులు నియమించడం జరిగిందని ఆయన తెలిపారు.

రాబోయే కాలంలో పార్టీ బలోపేతంపై చర్చ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో తాలూకా జనసేన పార్టీ ఇంచార్జ్ ఇరిగెల రాంపుల్లారెడ్డి, తాలూకా అధికార ప్రతినిధి ఇరిగెల సూర్య నారాయణ రెడ్డిలతో శిరివెళ్ల మండల జనసేన పార్టీ నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఇరిగెల రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ రాబోయే కాలంలో పార్టీ బలోపేతం కొరకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు సూచనలు అందజేశారు. కూటమి ప్రభుత్వం ద్వారా చేరే పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించి లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పెసరాయి చాంద్ బాష, జబీవుల్లా, పెద్ద బాలయ్య, బండెద్దుల ఖాదర్, ఇబ్రహీం ఖాన్, మాలి బాష, రఫీ, సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

దళితుడనే పదం వాడి అభాసు పాలు కావద్దు



విశాలాంధ్ర - నంది కొట్కూరు: ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సమావేశం మధ్యలో అర్థంతరంగా వెళ్లిన క్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య దళిత ఎమ్మెల్యేను అవమానించడమే నంటూ, సంబోధించడం చేసిన వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి ఆదివారం పట్టణంలోనే స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో పాత్రికేయుల సమక్షంలో తీవ్రంగా ఖండించారు. భారత రాజ్యాంగంలో మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ హక్కుల వల్ల ఎన్నికైన ఎమ్మెల్యేగా తన విలువను తాను కాపాడుకోవాలి తప్ప అనవసరంగా దళితుడు అనే పదం వాడి విలువను తగ్గించుకోకూడదని ఎమ్మెల్యే గిత్త జయ సూర్యకు సూచించారు. సమావేశపు నిర్వహణ అజెండాలోని అంశాలను చేర్చడం వాటిని ఆమోదం పొందే విధంగా చూడడం చైర్మన్ కే సర్వాధికారాలు ఉంటాయని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోకిల రమణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వైవీ రమణ, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభ్యర్థులు ఖర్చుచేసిన మొత్తాలకు తుది అకౌంట్స్ సమర్పించాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - నంద్యాల : సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలకు పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల్లో ఖర్చు చేసిన మొత్తాలకు తుది అకౌంట్స్‌ను వ్యయ పరిశీలకులకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ఎన్నికల వ్యయ పరిశీలకులతో కలసి జిల్లా కలెక్టర్ వివిధ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల పార్ల మెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎస్. మణి కందన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు కిరణ్ తొట్టుపురం అసోకన్, శ్రీశైలం, నంది కొట్కూర్, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు టికారాం మీనా, నోడల్ అధికారి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని నియోజకవర్గాల అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను ఈ నెల 3వ తేదీలోగా తప్పకుండా సమర్పించాలని సూచించారు. ఫలితాలు వెల్లడైన 30 రోజుల్లోపు ప్రతి అభ్యర్థి తమ వ్యయ వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలన్నారు. పరిమితికి మించి ఖర్చు చేసినా, లెక్కలను సరైన సమయంలో చూపకున్నా ఆ అభ్యర్థులపై అనర్హత వేటు పడటంతో పాటు తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కూడా కోల్పోతారని కలెక్టర్ తెలిపారు. అన్ని నియోజకవర్గాల సహాయ వ్యయ అధికారులు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు మోక్షమెన్నడో..

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని పెద్ద బోదనం నుంచి రాంపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో లక్షలాది రూపాయలను యలు వెచ్చించి చేపట్టిన వక్కిలేరు వంతెన పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. 23 ఏళ్లు గడిచిన పనులు నేటికి పూర్తి కాలేదు. గత టీడీపీ హాయంలో ఈ వంతెన పనులను రూ.20 లక్షలతో చేపట్టారు. ఆ నిధులతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి 75 శాతం పూర్తి చేసి నిధులు సరిపోలేదంటూ వదిలేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

నారాయణ విద్యా సేవలు మరువలేనివి : కత్తి నరసింహా రెడ్డి

విశాలాంధ్ర-పత్తికొండ: పందికోన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపధ్యాయులు, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు కుంపటి నారాయణ, ఆయన సతీమణి భారతి దంపతుల పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం బైపాస్ రోడ్డులోని రమ్య రిసార్ట్స్‌లో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కొత్తపల్లి నారాయణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా ఉపాద్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, జిల్లా అధ్యక్షులు గోకారిలు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణ ,భారతి విద్యా సేవలు మరువలేనివన్నారు. నారా యణ దంపతుల ముప్పై నాలుగేళ్ల ఉపా ద్యాయ వృత్తిలో అనేక మంది విద్యార్థులకు అంకిత భావంతో విద్యను అందించి తీర్చి దిద్దారని తెలిపారు. నారాయణ వయోవిద్య, అక్షర మహిళా ఉద్యమంలో బాధ్యతగా పని చేశారన్నారు. విద్యా బోధనకే పరిమితం కాకుండా సామాజిక చైతన్యంలో పాలు పంచుకుంటూ, ఉపాద్యాయుల సమస్యల పరిష్కారానికై నిరంతరం కృషి చేస్తూ అనేక ఉద్యమాలు చేపట్టి, ఉపాద్యాయ ఉద్యోగ సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. అనంతరం నారాయణ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా వయోజన విద్యా డైరెక్టర్ రమణ,మండల విద్యాదికారులు తిమ్మారెడ్డి, రంగస్వామి, మస్తాన్ వలి,ప్రముఖ రంగస్థల నటులు రంగారెడ్డి, లక్ష్మినారాయణ, ఎస్టీయూ నాయకులు చింతకుంట రమేష్, ఆదోని నాగరాజు, ఆలూరు నాగ రాజు, సుంకన్న, వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ మోహన్ రెడ్డి, చంద్ర శేఖర్, బలరాముదు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అభినందనీయం : రాష్ట్ర మంత్రి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కోవిడ్ సమయంలో వైద్యులు అందించిన సేవలు అభినందనీయమని, వైద్యు లను ప్రత్యక్ష దైవాలుగా అభివర్ణిస్తారని రాష్ట్ర పరి శ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూల్ నగరంలోని బి.క్యాంప్‌లో ఉన్న ఐఎంఏ భవన్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డాక్టర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య పితామహుడు డాక్టర్ బిసి రాయ్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వెంకటరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ బాల మద్దయ్య, డాక్టర్ శివశంకర్ రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రామచంద్ర నాయుడు, డాక్టర్ ఎస్వి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కరోనా సమయంలో కుటుంబ సభ్యులే ఒకరితో ఒకరు కలవలేని పరిస్థితుల్లో, వైద్యులు కరోనా ఉందని తెలిసిన పేషెంట్లకు అందించిన సేవలు అభినందనీయమని చెప్పారు. కర్నూల్ నగరంలో ఐఎంఏ భవనాన్ని నిర్మించడం, అందులో తమ టీజీవి గ్రూపు భాగస్వామ్యం ఉండడం ఆనందంగా ఉందని తెలియజేశారు .తాను ఎమ్మెల్యే కావడంలో అందరితోపాటు వైద్యుల ఆశీస్సులు కూడా ఉన్నాయని ఆయన వివరించారు .అందరి ఆశీస్సులతో రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నానని తెలియజేశారు. నగరంలోని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను తాను ఆకస్మికంగా తనిఖీ చేశానని, తన పర్యటనలో ప్రభుత్వ వైద్యశాలలో ఎన్నో సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలియజేశారు. వాటి అన్నింటిని ప్రణాళిక బద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. కర్నూలు నగరంలో ప్రైవేటు హాస్పిటల్స్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యశాలను తీర్చిదిద్దుతామని వివరించారు. గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో పూర్తిగా అభివృద్ధి కుంటుబడిపోయిందని వివరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పారిశ్రామిక రంగం, ఐటీ రంగం రాష్ట్రానికి ముఖచిత్రం వంటివని, ఈ రెండు రంగాల్లో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజేశారు. గతంలో చెప్పిన మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తామని వివరించారు.

చెల్లాచెదరమైన మృతదేహం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఆదోని నుంచి ఇస్వి రైల్వే స్టేషన్ల మధ్యలో రాయనగర్ కాలనీ సమీపాన ఉన్న రైల్వే ట్రాక్పై గుర్తు తెలియని పురుషుడు మృతదేహం (35) చెల్లా చెదురుగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఉదయం సుమారు 9:50 నిమిషాల సమయంలో కేఎం నెంబర్ 497/9 అప్లైన్ రైల్వే ట్రాక్ వద్ద ట్రైన్ నెంబర్ 16339 నాగర్ కోయిల్ ట్రైన్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తీవ్ర రక్త గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడికి కుడి భుజముకు త్రిశూలం పచ్చ బొట్టు, చేతికి బి.రాజు పేరు గల అక్షరములు ఉన్నాయని, గ్రే కలర్ లుంగీ, చిన్న నిలువు లైన్లు గల చిరిగిన చొక్కా, రెండు కాళ్లకు నల్లటి దారాలు ధరించినట్లు రైల్వే ఎస్సై గోపాల్ తెలిపారు. ఆచూకీ తెలిసినచో ఆర్పీఎస్ ఫోన్ నెంబర్ 9849157634కు సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

వీరన్న స్వామిని దర్శించుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షులు

విశాలాంధ్ర - కౌతాళం రూరల్ : టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి ఆది వారం ఉదయం మండలంలో వెలసిన ఉరుకుంద ఈరన్న స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా దేవాలయ అధికారులు శాలువాతో సన్మానించి స్వామివారి జ్ఞాపకాలు బహుమతిగా అందజేశారు. డిప్యూటీ కమిషనర్ వెంకటేష్‌తో ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు చెన్న బసప్ప, శివ మోహన్ రెడ్డి,కొటేష్ గౌడ్, డాక్టర్ రాజానందు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా 166వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : సోమవారం కర్నూలు జిల్లా 166వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు స్థానిక సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా మేధావుల వేదిక వ్యవస్థాపకులు ఆచార్య మన్సూర్ రెహమాన్ తెలిపారు. కార్యక్రమానికి చంద్ర శేఖర కల్కూర అధ్యక్షత వహిస్తారు. కర్నూలు జిల్లా చరిత్ర, సంస్కృతి, అభివృద్ధి పోకడల గురించిన మేధో మధన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషను ఆహ్వానించినట్లు వారు తెలిపారు. అనంత రం జిల్లా కలెక్టర్‌కు గ్లింప్సెస్ అఫ్ కర్నూలు గ్రంధాన్ని బహుక రించారు. కార్యక్రమంలో అఖ్తర్ బాను, ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

జన జాతర సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పత్తికొండ: మాదిగల జన జాతర సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రామ్ కొండ వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా అధ్యక్షులు పులికొండ మాదిగలు పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్సీ కాలనీలోని మారెమ్మ గుడి దేవాలయం ఆవరణంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7న ప్రకాశం జిల్లా ఈదుముడిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, వేడుకలకు మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుండి నేటి వరకు మాదిగల సమస్యలపై అనేక ఉద్యమాలు చేపట్టిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, రంగస్వామి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర - కౌతాళం రూరల్ : ఎస్సీ, ఎస్టీ చట్టానికి జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించి, ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఉరుకుంద గ్రామంలో మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సందర్భంగా నందు బాబు మాట్లాడుతూ తరాలు మారుతున్న ప్రభుత్వాలు మారుతున్న దళితుల తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ఎస్సీ, ఎస్టీ చట్టానికి జనాభా ప్రతిపాదికన బడ్జెట్లో నిధులు కేటాయించడం అత్యవసరమన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు గాను గ్రామ గ్రామాల కమిటీలను ఏర్పాటు చేసి పోరాటం చేసి సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సులేకేరి వీరేష్, చీరలదిన్నె ఈరన్న, బంటకుంట తాయప్ప, లింగాలదిన్నె ఆదాము, కరుణి తిక్కయ్య పాల్గొన్నారు.

నేడు నగరపాలకలో మీ కోసం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : సోమవారం ఉదయం 11:00 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ ఏ.భార్గవ్ తేజ ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరపాలకకు సంబంధించి అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని, ఏవైనా సమస్యలుంటే వచ్చి తెలపాలన్నారు. ఫిర్యాదు చేసే వారు అర్జీతో పాటు ఆధార్, మొబైల్ నెంబర్ తీసుకురావాలని కోరారు.

ఘనంగా ప్రారంభమైన విజయేంద్రతీర్థుల పంచరాత్రోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-హెూళగుంద: హెూళగుంద విజయేంద్ర తీర్థులు, రాఘ వేంద్ర స్వామి మఠంలో ఆదివారం విజయేంద్రతీర్థుల 410వ పంచరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పురోహితులు ప వమానాచారి ధ్వజారోహణ చేశారు ప్రార్ధన ఉత్సవం, గోపూజ, లక్ష్మీ పూజ, శాఖా ధ్యానోత్సవం పూజ, స్వస్తి వాచన మహా మంగళహారతి పూజా కార్యక్రమం ఘనంగా జరిగాయి రాఘవేంద్ర స్వామికి, ఆంజనేయ స్వామికి భక్తులు పురోహితులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారుభక్తులతో ఆలయం కిటకిటలాడింది.

మరిన్ని వార్తలు E-PAPERలో

నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు

విశాలాంధ్ర - తుగ్గలి: నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు జరిగాయి. జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్, జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ ఎస్.నాగరాజుల ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండ్ ఎస్.రవి కుమార్‌ల పర్యవేక్షణలో ఆదివారం పత్తికొండ సెబ్ పోలీస్‌లు తుగ్గలి మండల పరిధిలోని ఎల్లమ్మగుట్ట తాండా పరిసర ప్రాంతాలలో నాటు సారా స్థావరాలపై దాడిచేసి 1100 లీటర్ల నాటు సారా తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లపు ఊటను, 40 లీటర్లు నాటు సారాను ధ్వంసం చేసినట్లు సెబ్ పోలీసులు తెలిపారు.

పింఛన్ల పంపిణీ పండుగలో పాల్గొనండి

విశాలాంధ్ర - పెద్ద కడబూరు : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సోమ వారం జరుగే పింఛన్ల పంపిణీ పండుగలో టిడిపి నాయకులు సచివాలయ సిబ్బంది తో కలిసి పాల్గొనాలని టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ఆదివారం పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీలో క్లస్టర్ ఇంచార్జీ, యూనిట్ ఇంచార్జీ, భూత్ ఇంచార్జీలు స్థానిక సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయాలని ఆయన కోరారు.

వేదావతి సాగునీటి ప్రాజెక్టు సాధిస్తా

విశాలాంధ్ర - హెూళగుంద: ఢిల్లీలో ఎంపీ గెస్ట్ హౌస్‌లో కర్నూలు ఎంపీ పంచలింగాల నాగ రాజును ఆలూరు తాలూకా మాదాసి, మదారి కురువ సంఘం తాలూక ప్రధాన కార్యదర్శి కురువ మల్లయ్య, హెూళగుందా మండలం అధ్యక్షుడు పంపాపతి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ కచ్చితంగా కర్నూలు జిల్లా జీవనాడి అయినటువంటి వేదవతి ప్రాజెక్టు, నగరడోణ రిజర్వాయర్ ఆలూరు నియోజకవర్గంలో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ, జింకల్ పార్కు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఇవన్నీ కచ్చితంగా సాధించి తీరుతామన్నారు. కర్నూలు జిల్లాలో అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గాదిలింగప్ప, చాగప్ప, మండలం ఆర్యా వైశ్య సంగం నాయకులు నవీన్, సింగం సుదర్శన్ శెట్టి, వెంకటేష్, సమతాగేరి కేశప్ప, లోకేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో భాగస్వామ్యం కండి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం జరిగిందని, ఏప్రిల్, మే, జూన్ నెలలు సంబంధించి పెంచిన రూ. రూ.వెయ్యి చొప్పున కలిపి మొత్తం రూ.7 వేలను నేటి 6 గంటల నుంచే అందజేస్తున్నట్లు జిల్లా టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి తెలిపారు. దేశ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేస్తున్నట్లు తెలిపారు. సీఎంను స్ఫూర్తిగా తీసుకొని జిల్లా పరిధిలోని లబ్ధిదారులకు టీడీపీకీ చెందిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామం, బూత్ స్థాయి నాయకులందరూ అధికారులతో కలిసి పింఛన్ పంపిణీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

తేజోమయానంద స్వామిజీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఆది వారం పూజ్య గురూజీ తేజోమయానంద స్వామిజీ 74వ జన్మదిన వేడుకలు కర్నూలులోని చిన్మయ మిషన్‌లో ఘనంగా నిర్వహించారు. స్వామిజీ జన్మదినం సందర్భంగా చిన్మయ మిషన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు శంకర్ శర్మ పాల్గొని ఆధ్యాత్మిక శక్తి గురించి వివరించారు. నిత్యం దైవ చింతన, భగవంతుని శ్లోకాలు పలకడం వల్ల ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందని శంకర్ శర్మ తెలిపారు. చిన్మయ మిషన్ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని డాక్టర్ శంకర్ శర్మ కోరారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆయన ఆధ్యాత్మిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రేమానంద సరస్వతి, విజయ్ కుమార్ రెడ్డి, నాగరూరు శ్రీనివాస్, రత్నప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ..

విశాలాంధ్ర - దేవనకొండ : దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి నేడు 4,408 కోట్లను పింఛన్ల అందిస్తున్నామని, కూటమి ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల నాయకులు తెలిపారు. సంక్షేమ పాలకుడు, సామాజిక పింఛను విధానానికి ఆద్యుడు అయిన ఎన్టీఆర్ పేరుతో ఎన్టీఆర్ భరోసా పథకంగా సామాజిక భద్రత పింఛన్లు ఇకపై ఇంటి వద్దే పంపిణీ చేస్తామని స్పష్టంచేశారు. లబ్ధిదారుల ఇళ్ల వద్ద పింఛన్లను అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితోపాటు ఇతర శాఖలకు చెందిన క్షేత్రస్థాయి ఉద్యోగులను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్ గౌడ్, నాయకులు రంగన్న, సర్పంచ్ భాస్కర్, ఉచ్చిరప్ప, మలకన్నా, ఆకుల వీరేష్, ఐటీడీపి రామాంజినేయులు రాజా సాబ్, సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్లను ప్రవేశపెట్టింది టీడీపీ ప్రభుత్వమే

విశాలాంధ్ర - ఆదోని రూరల్: రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వృద్ధులు, వితంతువులకు సామాజిక భద్రతా కల్పించాలన్న లక్ష్యంతో పింఛన్లను తెలుగుదేశం ప్రభుత్వమే ప్రవేశ పెట్టిందని టిడిపి నియోజకవర్గ మాజీ ఇన్చార్జి, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ తెలిపారు. ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాం లో నెలకు రూ.35 చొప్పున అందించగా, తరువాత చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే రూ.75 కు పెంచారన్నారు. 2004 ఎన్నికల ప్రచారంలో పింఛన్‌ను రూ.200 చేస్తామని హామీ ఇచ్చిన వైసీపీ అధికారంలోకి రాగానే కేవలం రూ.25 మాత్రమే పెంచారని గుర్తు చేశారు. ఒకేదఫా చేస్తామని చెప్పలేదని దబాయిస్తూ ఏడాదికి రూ.,25చొప్పున అంటూ నాడు వైఎస్ మోసం చేశారన్నారు. 2014 జూన్ 8న చంద్రబాబు నాయుదు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే పెన్షన్లను రూ.వెయ్యికి పెంచారని, తరువాత రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు పెంచి పేదవారిని ఆదుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రూ.200 ఉన్న పింఛన్‌ను ఏకంగా రూ.1800 పెంచిన ఘనత టీడీపీకే సాధ్యమైందన్నారు. 50ఏళ్లు పైబడిన మత్స్యకారులకు, చేనేతలకు రూ.వెయ్యి పింఛన్ ఇచ్చామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 2014 నాటికి 39,27,521 పింఛన్‌లు ఉండగా 2019 మార్చి నాటికి 54.25 లక్షలకు పెంచిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల మేనిఫెస్టోలో రూ.3వేలకు పెంచుతానని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక కేవలం రూ.250 మాత్రమే పెంచి చేతులు దులుపుకుని పేద ప్రజలను నిట్టు నిల్వన మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదికి రూ.250 చొప్పున పెంచుకుంటూ పోతామని ప్రమాణ స్వీకారం రోజు ప్రకటించిన జగన్ సీఎంగా తొలి మాటపై మడమ తిప్పారని విమర్శించారు.

ఎమ్మెల్యే ఆదేశాల మేరకే పైప్‌లైన్ నిర్మాణం

విశాలాంధ్ర -వెల్దుర్తి: పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కే ఈ శ్యాం బాబు ఆదేశాల మేరకు పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌కు పైపులైన్ నిర్మాణ పనులు చేసినట్లు మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడ్ తెలిపారు. పట్టణంలోని జ్ఞానేశ్వర్ గౌడ్ స్వగృహం నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడారు. పట్టణంలోని బిసి బాలికల హాస్టల్ నందు నీటి వసతి లేదని ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబుతో హాస్టల్ వార్డెన్ శైలజ నీటి వసతి అదనపు గదులు విషయం తెలిపినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడ్ ద్వారా పైపులైన్ నిర్మాణ పనులు చేయించినట్లు మాజీ ఎంపీపీ పేర్కొన్నారు. ఈ నిర్మాణ పనులలో ఎటువంటి స్వలాభం, వర్గ విభేదాలకు తావు లేదని అన్నారు. కేవలం వెల్దుర్తి బీసీ బాలికల మంచినీటి వసతులు తీర్చేందుకు మాత్రమే పనులు చేశాము తప్ప ఇందులో ఎటువంటి స్వార్థ ప్రయోజనాలు లేవని పేర్కొన్నారు. ఈ నిర్మాణ పనులు గ్రామపంచాయతీ నిధుల ద్వారా ఉప సర్పంచ్ ఎన్.శ్వేత ఆధ్వర్యంలో తీర్మానం జరిపినట్లు మాజీ ఎంపీపీ తెలిపారు. వెల్దుర్తి బాయ్స్ కాలేజ్ దగ్గర అక్కడ కాలేజీ విద్యార్థులకు, చిరు వ్యాపారులకు ఉపయోగకరంగా ఉండేందుకు నీటి సౌకర్యం ఏర్పరిచి, పైప్ లైన్ నడిపించడం జరిగిందని తెలిపారు. ఈ పైప్ లైన్ బీసీ బాలికల వసతిగృహం నందు నడిపించడంతో విద్యార్థినిలు, విద్యార్థినీల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. దీంతో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబుకు కృతజ్ఞతలు తెలపడం జరిగింది. అదేవిధంగా గతంలో ఉపముఖ్యమంత్రి మాజీ కేఈ కృష్ణమూర్తి పరిపాలనలో బీసీ బాలికల వసతి గృహానికి మరియు బాలికల హైస్కూల్ అదనపు గదులు, గ్రౌండ్ లెవెలింగ్, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, దాతలు బ్రహ్మేశ్వర మైనింగ్ రామిరెడ్డి ద్వారా కూడా ఎన్నో అభివృద్ధి పనులు చేయించిన ఘనత టిడిపి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సిద్దును గట్టు వెంకటేశ్వర్లు, టిడిపి కార్యకర్తలు హరి, రాజేష్, నాగ సురేంద్ర, కరెంటు హరి, ధనుంజయ గౌడ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించి ఆదుకోవాలి

విశాలాంధ్ర- కల్లూరు: లద్దగిరి, అనుకొండ గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కల్లూరు మండలం ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ మేరకు ఆదివారం కల్లూరు అర్బన్ పరిధిలోని ఎమ్మెల్యే స్వగృహంలో బస్తిపాడు, చిన్నటేకూరు, తడకనపల్లి ,పుసులూరు, బొల్లవరం, రేమదూరు, అనుగొండ ,పెద్దటేకూరు తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైనార్టీ సంఘం నాయకులు గౌండ హుస్సేన్ బాష, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ గతంలో ఆర్టీసీ బస్సు తమ గ్రామాల మీదుగా వెళ్లడంతో విద్యార్థులు ప్రయాణికులు కర్నూలు పట్టణానికి రాకపోకలు సాగించేందుకు సులభతరంగా ఉండేదని, అధిక వర్షాలు కురిసి బస్తిపాడు దగ్గర ఉన్న హంద్రీ నదిపై బ్రిడ్జి కూలిపోవడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. అప్పటినుండి నేటి వరకు దశాబ్దాల పాటు ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గత కొన్నేళ్ల కిందట హంద్రీ నదిపై నూతన బ్రిడ్జిని నిర్మించి రాకపోకలకు సౌకర్యాలు కల్పించారని, పలుమార్లు ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆర్టీసీ డిపో మేనేజర్లకు వినతి పత్రాలు అందజేసినా ప్రయోజనం లేదన్నారు. దీంతో నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. నిలిచిపోయిన ఆర్టీసీ ఆర్డినరీ సర్వీసులను పునరుద్ధరించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తూచా తప్పకుండా అమలు చేస్తారని నిలిచిపోయిన బస్సుల సౌకర్యాలను కూడా పునరుద్ధరించి ప్రజల సౌకర్యాలను రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, మైనార్టీ సంఘం నాయకులు హుస్సేన్ భాష, ఇదుర్ బాష, మహబూబ్ బాష, మౌలాలి, బుజ్జి పాల్గొన్నారు.

ఆదోని అభివృద్దే ధ్యేయం

విశాలాంధ్ర - ఆదోని : ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి పలికి ఆదోని అభివృద్ధి ధ్యేయంగా పార్టీలకు, మతాలకతీతంగా పని చేస్తానని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. ఆదివారం ఈద్గాను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోని ఈద్గాకు రావలసిన నిధులు పైన, జరగాల్సిన అభివృద్ధి పనుల పైన కావలసినటువంటి నిధుల మంజూరు కొరకై ఇప్పటికే మైనార్టీ శాఖ మంత్రి పరుక్ అబ్దుల్లాను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. దానికి స్పందిస్తూ మైనారిటీ మంత్రి ఎవరు వచ్చినా వారికోసం, వారి కుటుంబం కోసం మాత్రమే కలిసే వారిని, తమరు మాత్రం ఆదోని అభివృద్ధి కోసం కలిశారని అన్నారని అన్నారు. ఏ ఒక్కరిని ఆకట్టుకోవడానికి మంత్రులను కలవను, ఎవరిని కలసిన ఆదోని అభివృద్ధికి సంబంధించిన విషయాలే చర్చిస్తా, గతంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం తప్పుడు మేమోలతో జారీ చేసి ముస్లిం మైనార్టీలను తప్పుదోవ పట్టించే విధంగా చేసిందని ఎద్దేవా చేశారు. ఆర్థిక అభివృద్ధి నిధులను ఈద్గా నిర్మించేందుకు ఖర్చు చేయాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఈద్గా నిర్మణం కొరకు మళ్లించడం అనేది అసాధ్యమైన ప్రక్రియ అన్నారు. కార్యక్రమంలో మైనారిటీ మత పెద్దలు ఖతీఫ్ జునేద్ సాహెబ్, ఖాజీ అల్తాఫ్ హుసేన్ సాహెబ్, టిడిపి సీనియర్ నాయకుడు మాజీ మార్కెట్ చైర్మన్ మధిర భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, జనసేనా నిజయోజకవర్గ సమన్వయకర్త మల్లప్ప, నియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

విశాలాంధ్ర- జిల్లా పరిషత్ : దేశానికి రైతులు వెన్నెముక లాంటి వారని, రైతులు బాగుంటేనే పల్లెలు, బాగుంటాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె.బాబురావు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వానికి, నూతన జిల్లా కలెక్టర్‌కు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున అభినందనలు తెలిపారు. దేశాభివృద్ధికి రైతుతో పాటు విద్య ముఖ్యమని భావించాలన్నారు. విద్య, వైద్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. తొలకరి చినుకులు పడి రైతులు నాట్లు వేసుకుంటున్నారని, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు రైతులకు నష్టపరిహారం కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, రైతులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. డిసిసి గౌరవాధ్యక్షులు ఉండవల్లి వెంకటన్న, డిసిసి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఈ లాజరస్, జిల్లా సోషల్ మీడియా చైర్మెన్ అమనుల్లా, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఎస్సీ బజారన్న తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందడం అభినందనీయం : ఎస్పీ

విశాలాంధ్ర - కర్నూలు క్రైం : సుధీర్ఘకాలం పోలీసుశాఖలో పని చేసి పదవీ విరమణ పొందడం అభినందనీయమని కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. పదవీ విరమణ పొందిన కర్నూలు స్పెషల్ బ్రాంచ్ ఎస్సై ఎస్.బాబున్ బాష, కర్నూల్ స్పెషల్ బ్రాంచ్ ఎస్సై టి.చంద్రశేఖర్, కర్నూలు మూడో పట్టణ మహిళా ఎస్సై బి.దేవమణి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె. హేమంత్ కుమార్ లను ఆదివారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శాలువకప్పి, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీసుశాఖకు వారు అందించిన సేవలను జిల్లా ఎస్పీ కొనియాడారు. కుటుంబాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, ఎ ఆర్ డిఎస్పి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్, ఆర్ఐలు నారాయణ, సోమశేఖర్ నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై మల్లికార్జున, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, పదవి విరమణ పోలీసు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడే పింఛన్‌ల పండుగ...

విశాలాంధ్ర - నంద్యాల : సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు అమరావతి పరిధిలోని తాడేపల్లి మండలం పెనుమాకలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. దానికి అనుగుణంగానే చంద్రబాబు స్ఫూర్తితో నంద్యాలలో రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్వయంగా పింఛన్? లబ్ధిదారులకు నగదు అందించనున్నారు. ఉదయం 6 గంటలకే పింఛన్‌దారులకు పాత బకాయిలతో కలిపి మొత్తం రూ.7 వేల నగదు అందజేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 65,18,496 మంది లబ్ధిదారులకు రూ.4408 కోట్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ కార్య క్రమంలో స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేయాలన్నారు. సామాజిక పింఛను దారుల భద్రతను తమ ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని, వారి ఆశలు, ఆకాంక్ష లను నెరవేర్చడమే తక్షణ కర్తవ్యంగా భావించి ముందడుగు వేశామని మంత్రి ఫరూక్ తెలిపారు.

ఇకపై ప్రజల ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ: దేశచరిత్రలో ఎన్నడూలేని విధంగా నేడు 4,408 కోట్లను పింఛన్ల రూపంలో ప్రజలకు అందిస్తున్నామని మంత్రి ఫరూక్ తెలిపారు. సంక్షేమ పాలకుడు, సామాజిక పింఛను విధానానికి ఆద్యుడు అయిన ఎన్టీఆర్ పేరుతో ఎన్టీఆర్ భరోసా పథకంగా సామాజిక భద్రత పింఛన్లు ఇకపై ప్రజల ఇంటి వద్దే పంపిణీ చేస్తామని స్పష్టంచేశారు. లబ్ధిదారుల ఇళ్ల వద్ద పింఛన్లను అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితోపాటు ఇతర శాఖలకు చెందిన క్షేత్రస్థాయి ఉద్యోగులను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.

ఎస్సీ జాబితాలో చేర్చే వరకు పోరాడుతాం

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: దశాబ్దాలుగా రజకుల చిరకాల ఆకాంక్ష ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ ఏపీ రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆలవకొండ మద్దిలేటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రెవిన్యూ కోటర్స్ నందు రజక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లా డుతూ దశాబ్దాలుగా రజకులు శుభ, అశుభ కార్యా లలో మురికి పట్టిన గుడ్డలను శుభ్రం చేస్తూ సమా జానికి ఎనలేని సేవ చేస్తూ ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, ఉద్యోగ పరంగా, సామాజికంగా అన్ని రంగాలలో వెనకబడి దుర్భరమైన జీవితాలను గడుపుతున్నామన్నారు. రాష్ట్రంలో రజకులు అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతూ శాసనసభలో తీర్మానం చేసి పార్లమెంటుకు నివేదికను పంపి ఎస్సీ జాబితా చట్టబద్ధతను కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2016-ఫిబ్రవరి నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశా లలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ప్రసంగంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రసంగంలో చెప్పడం జరిగింది. అంతేకాకుండా ప్రస్తుతం 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రజకులను కచ్చితంగా ఎస్సీ జాబితాలో చేర్చుతామంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన హామీని నెరవేర్చి రాష్ట్ర రజకుల ఆత్మ గౌరవాన్ని నిలుపుకోవాలని ఆయన అన్నారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతి రజకునికి పింఛను మంజూరు చేయాలని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు దాటిన రజకులు కుల వివక్షతకు గురవుతూ వెట్టి చాకిరి చేస్తూ బానిసలుగా బ్రతుకుతున్నామన్నారు. శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వమని అడిగితే రజకులపై దౌర్జన్యాలకు పాల్పడుతూ రజక స్త్రీలపై లైంగిక వేధింపులు, అరాచకాలకు, అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనగర్ రాము, గౌరవ అధ్యక్షులు మద్దయ్య, జిల్లా నాయకులు ఆర్ఎంపి నాగరాజు, అంజి, ఆర్ఎంపి శ్రీనివాసులు హనుమంతు, స్టూడియో నరసింహులు, సురేంద్ర, నాగ శేషు, శివుడు, నాగేశ్వరరావు, వేంపెంట ఎర్రి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర -కర్నూలు సిటీ: 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కోరారు. 104 ఉద్యోగుల సమావేశం యూనియన్ నాయకుడు చంద్రహాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రణాళికను తయారు చేయాలని కోరారు. ప్రభుత్వం ద్వారానే నిర్వహణ చేసి వారిని ఆప్కాసులో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను అమలు చేయాలని కోరారు. 104 ఉద్యోగులపట్ల అరవింద సంస్థ నిర్లక్షణంగా వ్యవహరి స్తుందని అన్నారు. రిటైర్మెంట్ వయసు పెంచినట్లే 104 లో పని చేస్తున్నటువంటి వారికి కూడా రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాల పెంచాలని వారు కోరారు. 104 సంఘం నూతన జిల్లా అధ్యక్షునిగా వెంక టేశు, జిల్లా ఉపాధ్యక్షురాలుగా కళ్యాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పదవీ విరమణ తప్పనిసరి ..

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరని ఎంఈఓ వీరప్రతాప్ రెడ్డి అన్నారు. మండలంలోని బోడెమ్మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యా యులుగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖరయ్య పదవీ విరమణ గావించడంతో ఆదివారం పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన రోజే పదవీ విరమణ పొందే తేదీ ప్రతి ఉద్యోగికి తెలుస్తుందన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో సేవలందిస్తూ తల్లిదండ్రుల తర్వాత జ్ఞానం అనే వెలుగును ప్రసాదించేది గురువేనని గుర్తు చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకున్నప్పుడే దేశానికి మంచి పౌరులను అందించిన వారమవుతామన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన చంద్రశేఖరయ్య, నాగేశ్వరమ్మ దంపతులను ఎంఈఓ, ఉపాధ్యాయులు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు.

ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చాగలమర్రి : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఆదివారం స్థానిక కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని చింతలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యుడు వెంకట సుబ్బారెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి దంపతులను ఆమె ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సుబ్బారెడ్డి విద్యార్థులను మంచి క్రమశిక్షణ నడవడికను నేర్పారన్నారు. ఎంతోమందిని ఉన్నత పదవుల్లో ఉండేటట్లు తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి కొలిమి మాభాష కొలిమి చిన్న హుస్సేన్ వల్లి ఆలంసా గారి హనీఫ్ మండలం లోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి..

విశాలాంధ్ర - నంది కొట్కూరు: గత ఆరు మాసాల నుంచి కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసు కున్న వారందరికీ పింఛన్లను మంజూరు చేయాలని సీపీఐ అనుబంధ రైతు సంఘం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణం నందు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, చేనేత కార్మికులకు మత్స్యకారులకు నెలసరి పింఛన్ పెంచడం హర్షించదగ్గ విషయమన్నారు. గత ఆరు మాసాల నుండి అనేకమంది జిల్లాలో ఉన్న సచివాలయాల్లో అన్ని రకాల కొత్త పెన్షన్లకు అప్లై చేసుకున్న కొత్త పెన్షన్లు మంజూరు కాలేదన్నారు. కనీసం ఈ ప్రభుత్వమైనా కొత్త పింఛన్లకు తక్షణమే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం గతంలో ఉన్న జీఓ రద్దుచేసి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇవ్వాలని కోరారు. వీటికి తోడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలో భాగంగా 50 సంవత్సరాలకే ఎస్సీ ఎస్టీ బీసీలకు పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ఆ హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు వి.సుధాకర్, కాటే పోగు సోమన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి : సర్పంచ్

విశాలాంధ్ర - బనగానపల్లె: సమస్యలను పరిష్కరించాలని మిట్టపల్లె కాపుర పల్లె గ్రామ సర్పంచ్ యడమ కంటి తులసి రెడ్డి కోరారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిట్టపల్లి కాపురపల్లె సర్పంచ్ యడమ కంటి తులసి రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామాల పరిధిలోని టిడిపి ప్రభుత్వ హయాంలో వాటర్ ట్యాంకులు నిర్మించడం జరిగిందని, అధికారులు వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం మరిచారన్నారు. ఐదేళ్ళు అయినప్పటికీ వాటర్ ట్యాంక్ ఓపెనింగ్ చేయలేదని మంత్రి బీసీ జనార్దన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విద్యుత్ ఏఈ ని సమస్య పరిష్కరించాలని సూచించారు.

వరల్డ్ కప్ గెలిచినందుకు సంబరాలు

విశాలాంధ్ర - బనగానపల్లె : దేశానికి చెందిన క్రికెట్ క్రీడాకారులు వరల్డ్ కప్ సాధించినందున భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు బాణాసంచ కాల్చి సంబరాలు చేసుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివన్న యాదవ్ మండల ప్రెసిడెంట్ యాదగిరి, బనగానపల్లె అసెంబ్లీ కన్వీనర్ బివి సుబ్బా రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో వివిధ ప్రాంతాలలో గుర్తించిన సమస్యలను వాటి పరిష్కారం కోసం నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిస్కారం కోసం కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్మిక కర్షక భవనంలో పాతబస్తీ సీపీఎం కార్యకర్తల సర్వే సభ్య సమావేశం ఎస్ఎండి షరీఫ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం హయాంలో ప్రజా సమస్యల పరిష్కార దశగా పని చేయకపోవడం వల్లే రాజకీయంగా మట్టి కరిచి పోయిందన్నారు. ఇప్పటి ప్రభుత్వం తెలుసుకొని జాగ్రత్తగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన హితవు పలికారు. ఎర్ర బురుజులో మ్యాన్ హెూల్స్ గత నాలుగు నెలలుగా తెరిచి ఉన్నాయని ద్విచక్ర వాహన దారులకు ప్రమాదకరంగా మారినప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండారెడ్డి బురుజు దగ్గర సర్కిల్‌లో రిపేరు చేయలేదని, ఈ కారణంగా ట్రాఫిక్ ఇబ్బంది అవుతుందన్నారు. సలాం ఖాన్ సర్కిల్ పెద్ద పార్క్ ముందర అసంపూర్తిగా ఉందని నగరంలో ఎక్కడ చూసినా సమస్యలు ఉన్నాయన్నారు. సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, రామకృష్ణ, అబ్దుల్ దేశాయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - నంద్యాల : గ్రామీణ ప్రాంత పేదల కోసమే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కార్పోరేట్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నంద్యాల శ్రీ గురురాఘవేంద్ర బ్యాంకు కోచింగ్, విద్యా సంస్థల అధినేత చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి అన్నారు. సంజామల మండలం మంగంపల్లె గ్రామంలో పెద్ది రెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్య శాలలో ఉచిత మెగావైద్య శిభిరం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి అద్వర్యం లో నిర్వహించారు. చారిట బుల్ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహించిన 45వ ఉచిత వైద్య శిబిరంలో విజయవంతంగా ముగి సింది. శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ నంద్యాల, కర్నూలు పట్టణానికి చెందిన అనుభవజ్ఞులైన డాక్టర్లతో వైద్య శిబిరంలో రోగులను ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తున్నామని అన్నారు. వైద్య శిబిరానికి హాజరైన ప్రజలందరికీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత భోజనం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ శిబిరంలో 1400 మంది రోగులు పాల్గొనగా ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. ప్రతి నెలా చివరి ఆదివారం పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీ గురు రాఘ వేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేకావలిరెడ్డి మాట్లాడుతూ మా అబ్బ జ్ఞాపకార్థం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ పేరున మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహి స్తామని తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 45వ వైద్య శిబిరాన్ని మంగంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్య శిబిరంలో పాల్గొనే వారందరికీ ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఖరీదైన మందులను అందజేస్తున్నామని తెలిపారు.

పోలీసుల సేవలు అభినందనీయం : ఎస్పీ

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లా పోలీసు కార్యాలయంలో నేడు జరిగిన ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి నేడు పదవీ విరమణ పొందిన వన్ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ పుల్లయ్య, నంద్యాల సిసిఎస్ సబ్ ఇన్స్పెక్టర్ యాసీన్, మహానంది సబ్ ఇన్స్పెక్టర్ బాలచంద్రుడు,బెతంచెర్ల సబ్ ఇన్స్పెక్టర్ కలిముల్లా బెగ్, ఏఎస్ఐ శంకర్ లతో పాటు పలువురిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అంకితభావంతో మంచి సేవలు అందించారని, విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఎక్కడ రాజీ పడకుండా ఉద్యోగ బాధ్యతలు చక్కగా నిర్వర్తించారని, సుదీర్ఘకాలం అనగా 30 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల వరకు పోలీస్ డిపార్ట్మెంట్ లో పనిచేయడం అనేది చాలా గొప్ప విషయం అని ఈ ప్రయాణంలో ఎన్నో ఒడుదుడుకులు కష్టసుఖాలు ఇబ్బందులను ఎదుర్కొని ఉంటారని వారి వద్ద నుండి కొత్తగా పోలీస్ డిపార్ట్మెంట్ లో చేరిన వారు ఎన్నో పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రవీణ్ కుమార్, ఇన్స్పెక్టర్ నరసింహులు, రిజర్వు ఇన్స్పెక్టర్లు మంజునాథ్, శ్రీనివాసులు, నాగభూషణం, ఆర్ ఎస్ఐలు హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన బలిజ సంఘీయులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నియోజకవర్గం ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా గెలుపొందిన భూమా అఖిలప్రియను ఆళ్లగడ్డ బలిజ సంఘీయులు కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ముందుగా పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి ఆళ్లగడ్డ బలిజ సంఘీయులు పూలమాలలు వేశారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకి శుభాకాంక్షలు తెలియజేశారు. భూమా అఖిలప్రియ గెలుపులో అన్ని వర్గాలతో పాటు బలిజ వారు ముఖ్య పాత్ర పోషించారని రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎలక్షన్లలోను, నామినేటెడ్ పోస్టులలోను బలిజ వారికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరు మండలాలలో కమ్యూనిటీ హాల్లు నిర్మించాలని ఎమ్మెల్యేకు మరియు ఆళ్లగడ్డ నియోజకవర్గం టిడిపి నాయకులు మద్దూరు భార్గవ్ రామ్‌కి తెలియజేశారు. యామ గుర్రప్ప, ప్రముఖ న్యాయవాది పత్తి సుబ్బరామిరెడ్డి, పత్తి సత్యనారాయణ, మైలేరి మల్లయ్య, సిద్ధి సత్యం, వీరయ్య, నల్లగట్ల బాలుడు, ఎంవి ప్రసాద్, శెట్టి వేణు, గుత్తి నరసింహుడు, అర్జీ గారి నర సింహుడు, ఆకుల వెంకటసుబ్బయ్య, వెంకటస్వామి, సిద్ధి నారాయణ, రాం దాస్, జిల్లా సుబ్బరాయుడు, బాచుపల్లి నారాయణ, ఏరువ కృష్ణమూర్తి, నాగ ప్రవీణ్, శీను, మోహన్, వెంకటసుబ్బయ్య, ఆంజనేయులు, బావికాడి గురప్ప, శ్రీరాములు, చైతన్య, అర్జీగారి శీను, ఈశ్వరయ్య, మంగమ్మ గారి ప్రసాద్, యమ శ్రీకాంత్, రాజేష్, గోవర్ధన్, లక్ష్మీ నరసయ్య, నీలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అభినందనీయం : రాష్ట్ర మంత్రి టీజీ భరత్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కోవిడ్ సమయంలో వైద్యులు అందించిన సేవలు అభినందనీయమని, వైద్యులను ప్రత్యక్ష దైవాలుగా అభివర్ణిస్తారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూల్ నగరంలోని బి.క్యాంప్‌లో ఉన్న ఐఎంఏ భవన్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్స్ డే వేడు కల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య పితా మహుడు డాక్టర్ బిసి రాయ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వెంకటరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ బాల మద్దయ్య, డాక్టర్ శివ శంకర్ రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రామచంద్ర నాయుడు, డాక్టర్ ఎస్వి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కరోనా సమయంలో కుటుంబ సభ్యులే ఒకరితో ఒకరు కలవలేని పరిస్థితుల్లో, వైద్యులు కరోనా ఉందని తెలిసిన పేషెంట్లకు అందించిన సేవలు అభినందనీయమని చెప్పారు. కర్నూల్ నగరంలో ఐఎంఏ భవనాన్ని నిర్మించడం, అందులో తమ టీజీవి గ్రూపు భాగస్వామ్యం ఉండడం ఆనందంగా ఉందని తెలియజేశారు. తాను ఎమ్మెల్యే కావడంలో అందరితోపాటు వైద్యుల ఆశీస్సులు కూడా ఉన్నాయని ఆయన వివరించారు .అందరి ఆశీస్సులతో రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నానని తెలియజేశారు. నగరంలోని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను తాను ఆకస్మికంగా తనిఖీ చేశానని, తన పర్యటనలో ప్రభుత్వ వైద్యశాలలో ఎన్నో సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలియజేశారు. వాటి అన్నింటిని ప్రణాళిక బద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. కర్నూలు నగరంలో ప్రైవేటు హాస్పిటల్స్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యశాలను తీర్చిదిద్దుతామని వివరించారు. గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో పూర్తిగా అభివృద్ధి కుంటుబడిపోయిందని వివరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పారిశ్రామిక రంగం, ఐటి రంగం రాష్ట్రానికి ముఖచిత్రం వంటివని, ఈ రెండు రంగాల్లో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజేశారు. గతంలో చెప్పిన మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తామని వివరించారు. కర్నూలు జిల్లా అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వైద్య రంగంలో వస్తున్న ఆధునిక వైద్య చికిత్సలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యు లకు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సూచిం చారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వెంకట రెడ్డి మాట్లాడుతూ సమాజంలో వైద్యుల పాత్ర మరువ లేనిదని తెలియజేశారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రామచంద్ర నాయుడు, డాక్టర్ ఎస్వి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగరంలో ఐఎంఏ కార్యక్రమాలకు రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, ఆయన తనయుడు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అందిస్తున్న సహకారం మరువ లేనిదని చెప్పారు. అనంతరం డాక్టర్స్ డేను పురస్కరించుకొని సీనియర్ వైద్యులను రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత వెంకటరెడ్డి చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌తో పాటు ఎమ్మెల్యే గౌరు చరిత వెంకటరెడ్డిని సన్మానించారు.

పింఛన్ పెంపుపై దివ్యాంగుల హర్షం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై అహర్నిశలు కృషి చేసే ఏకైక పార్టీ టీడీపీ అని వికలాంగుల జిల్లా అధ్యక్షుడు గంగాధర్ శెట్టి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్ శెట్టి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, బీసీ ఇందిరమ్మ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల టిడిపి నాయకుడు ఆమదాల మద్దిలేటి పాల్గొన్నారు. అనం తరం వారి ఇరువురు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు వృద్ధులకు వికలాంగులకు ఏదైనా న్యాయం చేయాలంటే ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని అది నారా చంద్రబాబునాయుడు తోనే సాధ్యమని వారు అన్నారు. మహిళా అధ్యక్షురాలు గాయత్రి, శ్రీనివాస్ రెడ్డి కత్తి ఓబులేసు, రాజు, మేకల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలకలో మీ కోసం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : సోమవారం ఉదయం 11గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ ఏ.భార్గవ్ తేజ ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరపాలకకు సంబంధించి అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని, ఏవైనా సమస్యలుంటే వచ్చి తెలపాలన్నారు. ఫిర్యాదు చేసే వారు అర్జీతో పాటు ఆధార్, మొబైల్ నెంబర్ తీసుకురావాలని కోరారు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ..

విశాలాంధ్ర - దేవనకొండ : దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి నేడు 4,408 కోట్లను పింఛన్ల అంది స్తున్నామని, కూటమి ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల నాయకులు తెలిపారు. సంక్షేమ పాలకుడు, సామాజిక పింఛను విధానానికి ఆద్యుడు అయిన ఎన్టీఆర్ పేరుతో ఎన్టీఆర్ భరోసా పథకంగా సామాజిక భద్రత పింఛన్లు ఇకపై ఇంటి వద్దే పంపిణీ చేస్తామని స్పష్టంచేశారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితోపాటు ఇతర శాఖలకు చెందిన క్షేత్రస్థాయి ఉద్యోగులను వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ భాస్కర్ గౌడ్, నాయకులు రంగన్న, సర్పంచ్ భాస్కర్, ఉచ్చిరప్ప, మల కన్నా, ఆకుల వీరేష్, ఐటీడీపి రామాంజినేయులు రాజా సాబ్ పాల్గొన్నారు.